జీకే.రమణకు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మెడల్

చిక్కడపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాతిక సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్స్ ద్వారా సేవలందిస్తున్న లయన్ డా.జీకే.రమణకు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఫ్యాబ్రికో ఒలవీర చేతులమీదుగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు. జూలై 1 నుంచి నూతనంగా తిరిగి డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా రమణను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. జీకే రమణ శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో మాట్లాడుతూ ఈ ఏడాది 10 లక్షల మందికి మధుమేహ పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ బాబురావు, డా.పట్టిహిల్, ఏపీ సింగ్, డా.మహేందర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి 7 వరకు ఆచార్య ఇనాక్ సాహితీసప్తాహం

చిక్కడపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభ నిర్వహణలో వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహాన్ని నిర్వహిస్తున్నామని గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి తెలిపారు. గానసభ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 1 నుంచి 7వ తేదీ వరకు రోజుకొక అంశంపై చర్చా కార్యక్రమం పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. ఎల్ఐసీ, జేడీమార్కెట్, జేఎన్ ఫీడర్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెడ్‌రోజ్, ఫతేమైదాన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రముఖ సంఘసేవకుడు పాలకూర్తి సుధాకర్‌రావు అస్తమయం


సుధాకర్‌రావు (ఫైల్)

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురకు చెందిన ప్రముఖ సంఘసేవకుడు, జైభవానీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలకూర్తి సుధాకర్‌రావు అస్తమించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రతి అమావాస్య నాడు బర్కత్‌పుర చమాన్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. ప్రతి దసరాకు దేవీనవరాత్రి వేడుకల్లో భాగంగా వివిధరకాల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేసేవారు. ఆయన అంత్యక్రియలు శనివారం సాయంత్రం అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో జరిగాయి. బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, శ్రీశ్యామ్‌మందిర్ సేవాసమితి ప్రతినిధి రాజ్‌కుమార్ విగ్ తదితరులు ఆయనకు నివాళులర్పించారు.

దోమల నివారణకు చర్యలు : కార్పొరేటర్

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శనివారం బర్కత్‌పుర రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఎంటమాలజీ విభాగం సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో దోమలపై అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురికిచెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమలు వృద్ధిచెందితే మలేరియా, డెంగీ బారినపడే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏఎంహెచ్‌వో హెమలత, దుర్గాప్రసాద్‌రెడ్డి, నరేందర్, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి


ఉద్యమకారుల జేఏసీ సదస్సులో పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్, యాదగిరి, రాంరెడ్డి తదితరులు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని జస్టిస్ బి.చంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నేతలు మోహన్ బైరాగి, చంద్రన్నప్రసాద్, కుమార్‌స్వామి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నరకాలం గడచినా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి, తుల్జారెడ్డి, లావణ్య, యాదగిరి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్‌లైట్స్, పోల్స్ ఏర్పాటుకు ప్రత్యేకచర్యలు

చిక్కడపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నూతన స్ట్రీట్‌లైట్లు, పోల్స్ ఏర్పాటుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నూతన హైమాస్ట్ లైట్లు, 10 నూతన స్ట్రీట్‌లైట్స్ పోల్‌ల ఏర్పాటు పనులను శనివారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న స్ట్రీట్‌లైట్స్, పోల్స్ సమస్యపై ప్రజలు చేసిన ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు ప్రస్తావించానన్నారు. అనంతరం అధికారులు లైట్ల ఏర్పాటుపై ప్రత్యేకచర్యలు చేపట్టారని వివరించారు. డార్క్ పాయింట్స్ వద్ద ఏర్పాటు చేసిన నూతన పోల్స్‌కు త్వరలో లైట్లను అమర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్ట్రీట్‌లైట్స్ సూపర్‌వైజర్లు బాలునాయక్, రాజ్‌కుమార్, సిబ్బంది, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీ రాజు, ఎం.ఉమేష్, పాల శ్రీను, సురేందర్, ఆనంద్‌రావు, నర్సింహ, సంధ్యారాణి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ క్యాంటీన్ పేరు మార్చొద్దు : బీఆర్ఎస్

ముషీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపునింపేందుకు గత ప్రభుత్వం అన్నపూర్ణ పేరుతో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ల పేరును మార్చి, ఇందిరమ్మ క్యాంటీన్‌లుగా పేరు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ముషీరాబాద్ నుంచి బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... రాజకీయ స్వార్థంతో కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేర్లు మార్చి ప్రజలను మభ్యపెడుతున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్, ముషీరాబాద్, బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ గుప్తా, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు ఉమాకాంత్, శంకర్‌గౌడ్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

రైలుకింద పడి రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న రిటైర్డ్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎం.హనుమంతరావు(77) రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆయనకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉండగా, రెండో కుమారుడు ఇటీవల మృతి చెందాడు. కుటుంబ సమస్యలతో సతమతమువుతున్న హనుమంతరావు శుక్రవారం అర్ధరాత్రి విద్యానగర్ - జామైఉస్మానియా రైల్వే స్టేషన్ల నడుమ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న కాచిగూడ రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం అనంతరం కుమారుడు శ్రీనివాసరావుకు అందజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడి బ్యాగు చోరీ

రైలు ప్రయాణికుడి బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన అనూప్‌గవార్ ఏపీ సంపర్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నాడు. ఆలేరు రైల్వే స్టేషన్ సమీపంలో ఆయన బ్యాగును దొంగలు తస్కరించారు. బ్యాగులో రెండు సెల్‌ఫోన్‌లు, వెయ్యి రూపాయల నగదు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం నల్గొండ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

స్వేచ్ఛ మృతితో ముషీరాబాద్‌లో విషాద-ఛాయలు


స్వేచ్ఛ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ టీవీ యాంకర్ స్వేచ్ఛ మృతితో ముషీరాబాద్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. ముషీరాబాద్‌లోని వైఎస్ఆర్ పార్కు సమీపంలోని స్వేచ్ఛ ఇంటివద్దకు పెద్ద ఎత్తున ముషీరాబాద్, బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో పాటు బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్, వివేక్, సత్యనారాయణ తదితరులు ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ముషీరాబాద్ నుంచి ఆమె అంతిమయాత్రను వైఎస్ఆర్‌పార్కు, అంబర్‌నగర్ శ్మశానవాటిక వరకు నిర్వహించారు. అంతిమయాత్రలో స్వేచ్ఛ పాడెను ఎమ్మెల్యే గోపాల్ మోసారు. దారిపొడవునా పెద్ద ఎత్తున ముషీరాబాద్ నేతలు పాల్గొన్నారు.

డీసీఎల్ జాసన్‌కు అభినందన

దేశంలోనే అత్యధిక నష్టపరిహారం ఇప్పించిన తెలంగాణ కార్మికశాఖ


మాట్లాడుతున్న డీసీఎల్ జాసన్

చిక్కడపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల నష్టపరిహారం చట్టం ప్రకారం ఎన్‌టీపీసీ కార్మికుడు చాట్రగడ్డ ప్రభాకరరావు కుటుంబానికి దేశంలోనే అత్యధిక నష్టపరిహారాన్ని తెలంగాణ కార్మికశాఖ ఇప్పించిందని హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్(డీసీఎల్)-1 బి.జాసన్ తెలిపారు. శనివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2010లో విధినిర్వహణలో ఎన్‌టీపీసీలో పనిచేసే చాట్రగడ్డ ప్రభాకరరావు మృతి చెందారని, నష్టపరిహారం కేసును మొదట కరీంనగర్‌లో ఫైల్ చేశారని వివరించారు. తర్వాత ఆ కేసును అప్పట్లో హైదరాబాద్ ఏసీఎల్-3 గా ఉన్న తనకు బదిలీ చేశారని, ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించానన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత కార్మికుల నష్టపరిహారం చట్టం ప్రకారం మృతుడి భార్య రేవతికి రూ.47,66,100 నష్టపరిహారం చెల్లించాలని, దానికి తోడు 2010నుంచి ఏడాదికి 12 శాతం వడ్డీ కలిపి ఇవ్వాలని ఆదేశించామన్నారు. దాని ప్రకారం ఆ మొత్తం వడ్డీతో కలిపి రూ.1,34,78,269 అయిందని, ఈ మొత్తాన్ని ఎన్‌టీపీసీ చెల్లించిందని తెలిపారు. ఆ మొత్తాన్ని మృతుడి భార్య రేవతికి అందజేశామన్నారు. ఇంత పెద్దమొత్తంలో నష్టపరిహారం కార్మికుడి కుటుంబానికి చెల్లించడం దేశంలోనే ఇదే తొలిసారి అని ఈ ఘనత తెలంగాణ కార్మికశాఖకు దక్కిందన్నారు. ఆ ఆర్డర్ ఇచ్చిన ఏసీఎల్ బి.జాసన్ ప్రస్తుతం పదోన్నతి పొంది హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కార్మికశాఖ మంత్రి జి.వివేక్ మార్గదర్శకత్వంలో కార్మికశాఖ ముందుకు పయనిస్తున్నదని తెలిపారు. కాగా ఇన్‌చార్జి కమిషనర్ దానకిషోర్ తన విశేష పరిపాలన అనుభవంతో కార్మికశాఖను తీర్చిదిద్ది, కార్మికులకు సత్వరసేవలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

అవార్డులతో విద్యార్థులకు మరింత ప్రోత్సాహం



విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అవార్డులు విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. పోటీపరీక్షల్లో పాల్గొనే విద్యార్థుల్లో నూతన అంశాలను నేర్చుకోవాలనే ఆకాంక్ష పెంపొందుతుందని అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సెమ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సెమ్స్ నేషనల్ అవార్డులు-2025 ప్రదానం చేశారు. సంస్థ కన్వీనర్ అరుకాల రాంచంద్రరెడ్డి, అధ్యక్షుడు రాఘవ, డైరెక్టర్ జయప్రసాద్, శేఖర్, అస్లాం, శశికళల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులను విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు ఎస్ఎన్.రెడ్డి, ఒలంపియాడ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, ప్రముఖ మోటివేటర్ కేవీ.ప్రదీప్‌కుమార్, స్కేటింగ్ ప్రపంచ చాంపియన్, అర్జున్ అవార్డు గ్రహీత అనూప్‌కుమార్, తెలంగాణ సైన్స్ ఫెయిర్ అకాడమీ ఉపాధ్యక్షుడు జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల రచనా ప్రతిభను ప్రోత్సహించాలి


పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకట రమ తదితరులు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పిల్లల రచనా ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకట రమణ అన్నారు. శనివారం రాత్రి బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిన్నారి సింహాద్రి ఆయుశీ రచించిన ఫైనల్లీ ఏ ట్రూ ఫ్రెండ్, సింహాద్రి నాగ శిరీష రచించిన అమ్మమాట, విరిజల్లు, ద చిట్టెలుక పుస్తకాలను ప్రముఖ వక్తలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి చొక్కాపు వెంకటరమణ, డాక్టర్ చిలువేరు రవీందర్, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాజీ న్యూస్ రీడర్ పంచాయతీ సెక్రటరీ జి.తులసి ప్రసాద్ అనుసంధాన కర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ వ్యవస్థాపకులు స్వామి శివకుమారి, డాక్టర్ జీజే ప్రసునాంభ, ఆర్.యమిని మోహన్, రేష్మా ఇనామ్దార్ పాల్గొన్నారు.

ఆ 27 కులాలను బీసీల జాబితాలో చేర్చొద్దు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన 27 బీసీ కులాలను తెలంగాణ బీసీల జాబితాలో చేర్చొద్దని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బీసీ ఏ కులాల మేథోమధన సమావేశం జరిగింది. బీసీ కులాల ప్రతినిధులు న్యాయవాది సుదర్శన్, శంకర్, ప్రొఫెసర్ బాగయ్య, శాంతప్ప, ఎం.భూపతి మాట్లాడారు. బీసీ ఏ జాబితాలో ఏపీకి చెందిన 27 బీసీ కులాలను కలిపితే తెలంగాణలోని బీసీ కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఏ కులాల నాయకులు మోహన్, విశ్వేశ్వర్, గడప శ్రీహరి, నరహరి, రాజ్యలక్ష్మి, శైలజ, సాంబయ్య, చిత్తరంజన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జర్నలిస్ట్, యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్యకు కారకులైన వారిని గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆర్‌పీఐ-ఏ పార్టీ నేతలు శనివారం సాయంత్రం చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రవి, పీటర్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. వివిధ ఛానళ్లలో పనిచేసిన స్వేచ్ఛ ధైర్యవంతురాలుగా తెలుస్తుందన్నారు. ఆమె ఆత్మహత్య వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా బంగారు మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన


బంగారు మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి తదితరులు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్‌లోని బంగారు మైసమ్మ గోల్డెన్ టెంపుల్‌లో శనివారం బంగారు మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో భాగంగా చండీహోమం, అమ్మవారి కల్యాణం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పీపల గంగాధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకుడు ఆర్.వివేక్ హాజరయ్యారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధురాజు, రవికుమార్, జ్ఞానేశ్వర్, శ్రీరామ్‌నగర్ బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు.


కుర్చీలు, కార్పెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు లయన్ మనోహర్‌రెడ్డి, లయన్ గణేష్

నిరుపేదల సేవలో లయన్స్‌క్లబ్

కవాడిగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలు వైద్యం చేయించుకునే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్320 హెచ్ గవర్నర్ లయన్ మనోహర్‌రెడ్డి సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో శనివారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ గగన్‌మహల్‌లో ఉన్న హెల్త్ సెంటర్‌లో లయన్ అడ్డగాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆస్పత్రికి అవసరమైన 40 కుర్చీలు, రెండు కార్పెట్లను డాక్టర్ రాజ్యలక్ష్మికి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్‌చైర్‌పర్సన్ లయన్ సుబ్రమణ్యం, జోన్ అధ్యక్షుడు లయన్ శేరుపల్లి గణేష్, కార్యదర్శి లయన్ చంద్రమోహన్ నర్సపెల్లి, ప్రాజెక్ట్ చైర్మన్ లయన్‌హేమంత్, సభ్యులు కాసమ్ శ్రీనివాస్, రాముమూర్తి, విజయేందర్‌రెడ్డి, సుమన్, కమలాకర్, డీబీఆర్‌మిల్ ఆస్పత్రి డాక్టర్ అవంతి, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలెంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీరాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధానకార్యదర్శి బొల్ల రమేష్, ఓబీసీమోర్చా అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నేతలు బియ్యంశ్రీనివాస్ ముదిరాజ్, కుమార్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్షుడు శేరుపల్లి గణేష్‌ను ఘనంగా సత్కరించారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు నివాళి



ముషీరాబాద్/అంబర్‌పేట జోన్‌బృందం, జూన్ 28 ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు కరణం సురేష్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు చౌరస్తాలో పీవీ.నరసింహారావు జయంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవాదళ్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యం హాజరై పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయకుమార్‌యాదవ్, వరదరాజు, జయకుమార్, కిరణ్, మధు, ఆనంద్ ముదిరాజ్, వల్లభ్‌రెడ్డి, నరేందర్, ప్రేమ్, సురేష్, సీ.హెచ్.మురళీకృష్ణ నివాళులర్పించారు.

- బ్రాహ్మణ సమాఖ్య అడిక్‌మెట్ డివిజన్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు చౌరస్తాలో కొండపల్లి మాధవ్ ఆధ్వర్యంలో పీవీ.నరసింహారావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కౌండిన్య ప్రసాద్, రొయ్యూరు శేషసాయి, నైషధం సత్యనారాయణ మూర్తి, వంశీ, సతీష్, నారాయణరావు, రాధాకృష్ణ, విశ్వనాథశాస్త్రి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.
- అడిక్‌మెట్‌లో పీవీ.నరసింహారావు చిత్రపటానికి బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు మాధవ్ చిట్టి, సాయిచాణిక్య రెడ్డి నివాళులర్పించారు.
- మాజీ ప్రధాని దివంగత పీవీ.నరసింహారావు జయంతి సందర్భంగా శనివారం ఆయన సమాధి వద్ద తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మాజీ ప్రధాని దివంగత పీవీ.నరసింహారావు జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలో పీవీ.విగ్రహానికి పీవీ.సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, నాయకులు కానాల శ్యామ్‌సుందర్‌రావు, ఎం.రాజేశ్వరశర్మ, దేవులపల్లి అశోక్‌కుమార్, గూడ జయరాం, టి.రంగసాయి, జి.జయచందర్, వీరరాజు, దేవులపల్లి నరసింహారావు, మురళీధర్‌రావు,ఎం.వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

ప్రగతిశీల చట్టం ఉన్నా మహిళలకు తప్పని సవాళ్లు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి

కవాడిగూడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల చట్టం ఉన్నప్పటికీ మహిళలు సామాజిక, చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి ఆందోళనవ్యక్తం చేశారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణామఠంలోని స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్సీ హాలులో తెలంగాణ న్యాయవాది పరిషత్ ఆధ్వర్యంలో మహిళాసాధికారత రాజ్యాంగ బాధ్యత అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జస్టిస్ టి.మాధవీదేవి, రామకృష్ణామఠం అధ్యక్షుడు స్వామి బోదమయానంద, తెలంగాణ న్యాయవాద పరిషత్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి.లక్ష్మి హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి పూర్వం.. నేటి సమకాలీన కాలం వరకు మహిళా కేంద్రీకృతచట్టాల పరిణామాన్ని మాధవీలత వివరించారు. తెలంగాణ న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జీ సంపద కృష్ణమూర్తి, ప్రధానకార్యదర్శి సునీల్, కార్యదర్శి కవితాయాదవ్, కోశాధికారి మాఫియోసో, హైకోర్టు అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

'42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి'

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు అమలుచేసి వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్ట బబ్లూగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. బీసీ బిల్లుపై గడచిన మార్చి 17న అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, గవర్నర్‌కు పంపిన నేపథ్యంలో ఆమోదించారా లేదా అనేది స్పష్టం చేయాలన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు పెడతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.